# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ నలంద విశ్వవిద్యాలయం భారతదేశ వారసత్వానికి, సంస్కృతికి చిహ్నమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ అమరావతి రాజధాని ప్రాంతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు పర్యటించనున్నారు.
- ❖ ఉపాధి హామీ పథకానికి ఉద్యానవన పనులను అనుసంధానిస్తూ.... ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు జారీ చేశారు.
- ❖ రానున్న శాసన సభ సమావేశాల్లో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అర్ధవంతమైన చర్చలు జరగాలని శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ ఆకాంక్షించారు.
- ❖ సికిల్ సెల్ ఎనీమియాను నిర్మూలించే దిశగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని విజయనగరం జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ ఎస్. భాస్కర రావు కోరారు.

==========================

నలంద విశ్వవిద్యాలయం భారతదేశ వారసత్వానికి, సంస్కృతికి చిహ్నమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బిహార్‌లోని రాజ్‌గిర్‌లో నలంద విశ్వవిద్యాలయ నూతన ప్రాంగణాన్ని ఈరోజు ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పురాతన శిథిలాల నుంచి నలంద విశ్వవిద్యాలయం పునరుజ్జీవించిందని కొనియాడారు. ఈ నూతన ప్రాంగణం భారతదేశ సామర్థ్యాన్ని ప్రపంచ దేశాలకు పరిచయం చేస్తోందన్నారు. అగ్ని కీలల్లో పుస్తకాలు కాలిపోవచ్చు కాని, జ్ఞానం కాదని వివరించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర వి.అర్లేకర్, బీహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఐదో శతాబ్దంలో స్థాపించిన ఈ నలంద విశ్వవిద్యాలయం దాదాపు 800 సంవత్సరాల పాటు సేవలు అందించింది. 2016లో ఈ విశ్వవిద్యాలయ ప్రాంతాన్ని ఐక్యరాజ్యసమితి వారసత్వ సంపదగా ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమరావతి రాజధాని ప్రాంతంలో రేపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా రాజధాని ప్రాంతంలో నిర్మాణాల స్థితిగతులను పరిశీలించనున్నారు. రేపు ఆయన నివాసం నుంచి ఉదయం 11 గంటలకు బయలుదేరి ఉద్దండరాయునిపాలెంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధానికి శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని సందర్శిస్తారు. అక్కడి నుండి సీడ్ యాక్సిస్ రోడ్ మీదుగా ప్రయాణించి అఖిల భారత సర్వీసుల అధికారులు, మంత్రులు, న్యాయ మూర్తుల గృహ సముదాయాలు, ఇతర నిర్మాణాలను పరిశీలించనున్నారు. పర్యటన అనంతరం చంద్రబాబు నాయుడు పాత్రికేయుల సమావేశం నిర్వహిస్తారని ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా కొణిదెల పవన్ కల్యాణ్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఈరోజు ఆయన ఉపముఖ్యమంత్రి బాధ్యతలతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రిగా కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా  ఉపాధి హామీ పథకానికి ఉద్యానవన పనులను అనుసంధానించే నిధుల మంజూరు దస్త్రంపైన, గిరిజన గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణ దస్త్రంపై ఆయన సంతకాలు చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పవన్ కల్యాణ్ కు మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ తో పాటు వివిధ శాఖల అధికారులు, శాసనసభ్యులు అభినందనలు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించేలా కృషి చేయాలని రాష్ట్ర గనులు భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులకు సూచించారు. ఈరోజు కృష్ణ జిల్లా కలెక్టరేట్ లో వివిధ అధికారులతో సమావేశం నిర్వహించారు. బందరు పోర్టు అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2025 అక్టోబరు నాటికి మొదటి దశ పూర్తి చేసే లక్ష్యంతో బందర్ పోర్టు అభివృద్ధి పనులు చేపట్టామని, ఇప్పటివరకు 709 కోట్ల రూపాయలు వ్యయం చేశామని అధికారులు మంత్రికి వివరించారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పట్టణంలో తాగునీటి సరఫరా పరిస్థితిపై మంత్రి మాట్లాడుతూ....

(వాయిస్ 26 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న శాసన సభ సమావేశాల్లో రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి  సంబంధించి అర్ధవంతమైన చర్చలు జరగాలని కోరుకుంటున్నానని శాసనసభ వ్యవహారాల శాఖామంత్రి  పయ్యావుల కేశవ్ అన్నారు. ఈరోజు శాసన సభ కార్యాలయంలో శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... జవాబుదారీతనంతో కూడిన పారదర్శకమైన పాలన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్ర ప్రజలకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈనెల 21 నుంచి జరగనున్న శాసనసభ సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్ల దస్త్రంపై తొలి సంతకం చేశారు. ఇదిలా ఉండగా తెలుగు దేశం పార్టీ సీనియర్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరిని ప్రొటెం స్పీకర్గా వ్యవహరించాలని మంత్రి కోరారు. పయ్యావుల కేశవ్ ప్రతిపాదనను బుచ్చయ్య చౌదరి అంగీకరించడంతో ప్రొటెం స్పీకర్గా రేపు గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్  ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నూతన నేర న్యాయ చట్టాలపై దామోదర సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. పి. నందిని గారితో రేపు ఉదయం 10 గంటలకు ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం ద్వారా ప్రత్యేక పరిచయ కార్యక్రమం వింటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతిరోజు ఒక గంట యోగా చేయడం వల్ల అనారోగ్య సమస్యలు దూరమవుతాయని యోగ గురువు అయిలం సుజాత అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఆమె ఆకాశవాణితో మాట్లాడుతూ... యోగ సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తుందని తెలిపారు. 2014 సంవత్సరం నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో విద్యార్థులకు యోగా శిక్షణ ఇస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను తప్పనిసరిగా చేయాలని కోరుతూ....

(వాయిస్ 19 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సికిల్ సెల్ ఎనీమియాను 2047 సంవత్సరం నాటికి పూర్తిగా నిర్మూలించే దిశగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని విజయనగరం జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ ఎస్. భాస్కర రావు పిలుపునిచ్చారు. ప్రపంచ సికిల్ సెల్ నివారణా దినం సందర్భంగా ఈరోజు విజయనగరంలోని గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాల్లో అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభావిత గిరిజన ప్రాంతాలలో ఉన్న 40 ఏళ్లలోపు వయస్సు వారికి అవగాహన కల్పించి, ముందస్తుగా రక్త పరీక్షలు చేయడం, అవసరమైన వారికి కౌన్సిలింగ్ నిర్వహించడమే లక్ష్యంగా ఈ మిషన్ పని చేస్తుందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ నూతన అడ్వొకేట్ జనరల్ గా దమ్మాలపాటి శ్రీనివాస్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు న్యాయ శాఖ కార్యదర్శి సత్యప్రభాకర్రావు ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు. దమ్మాలపాటి శ్రీనివాస్ అడ్వొకేట్ జనరల్ గా నియమితులవడం ఇది రెండోసారి. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో 2016 మే 28 నుంచి 2019 వరకు ఆయన అడ్వొకేట్ జనరల్ గా బాధ్యతలు నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రబీ సీజన్ కు సంబంధించిన పంట నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర బృందం ఈరోజు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పర్యటిస్తోంది. కేంద్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ సందీప్ శర్మ నేతృత్వంలో మన్ను జి ఉపాధ్యాయ్, మదన్ మోహన్ మౌర్యలతో కూడిన బృందం ఈరోజు కలెక్టరేట్ లో వివిధ అధికారులతో సమావేశామయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా జరిగిన పంట నష్టాలను అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం కలిగిరి, కొండాపురం మండలాల్లోని వివిధ గ్రామాల్లో కరవు బృందం పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేయనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న రెండు, మూడు రోజుల్లో నైరుతి రుతుపవనాలు మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘఢ్, ఒడిశా, కోస్తా ఆంధ్రప్రదేశ్ లలో కొన్ని ప్రాంతాల్లో మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుంచి, ఓ మోస్తరు వర్షం, లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =